# 8. సైమన్ తండ్రి

మిట్టమధ్యాహ్నమైంది. బడి తలుపులు తెరువబడినాయి. పిల్లలు త్వరత్వరగా బైటపడేందుకు ఉత్సాహంతో పరుగెత్తసాగారు. వెంటనే ఇళ్ళకు వెళ్ళి భోజనాలు చేయటానికి బదులు, వారు బైట కొద్దిదూరంలో ఆగి చిన్న చిన్న గుంపులుగా కూడి గుసగుసలు ప్రారంభించారు.

విశేషమేమంటే బ్లాంభొట్టే కుమారుడు సైమన్ ఇవాళే స్కూల్లో ప్రవేశించాడు. యీ పిల్లలు తమ కుటుంబ సంభాషణల్లో బ్లాంభొట్టేని గూర్చి చాలాసార్లు వినే వున్నారు. ఆమెను బాహాటంగా ఎవ్వరూ ఏమీ అనలేకపోయినప్పటికీ, తల్లులు ఆమె పట్ల ద్వేషాన్ని కాకున్నా ప్రీతిని మాత్రం చూపేవాళ్ళు కాదు. సంగతేమిటో తెలియకుండానే పిల్లలు ఆమె అంటరాని వ్యక్తి అనే విషయాన్ని నమ్మారు.

పోతే సైమన్ విషయం– వాణ్ణి ఎవ్వరూ ఎరగరు. వాడెప్పుడూ గ్రామవీధుల్లో కానీ, నదిఒడ్డున కానీ తమతో ఆడుకునేందుకు రాలేదు. అసలు ఇల్లు కదిలే వాడే కాదు. ఈ అపరిచిత వ్యక్తి పట్ల మిగతా పిల్లలు అభిమానపడ లేదు.

ఇప్పుడు ఈ గుంపులో ప్రతి ఒక్కరి ముఖంలోనూ ఒక రకమైన ఆశ్చర్యమూ, ఆనందమూ మిళితమై ఉన్నవి. ఒకానొక పధ్నాలుగు పదిహేనేళ్ళ కుర్రాడు “నీకు సైమన్ తెలుసుగా. వాడికి తండ్రి లేదు” అన్నాడు. బహుశా తామెవరికీ తెలియని వింత సంగతులన్నీ ఈ కుర్రవాడికి తెలుసునని మిగతావాళ్ళ నమ్మకం. తాము విన్న ఈ వింతను ఒకరితో వేరొకరు చెప్పుకోసాగారు.

అందరికన్నా వెనుక సైమన్ వచ్చాడు. వాడి వయస్సు ఏడెనిమిదేళ్ళు వుంటుంది. పాలిపోయి వున్నాడు. అయితే చాలా శుభ్రంగా వున్నాడు. చాలా సిగ్గుపడుతున్నట్లు,

భయపడుతున్నట్లు కనిపిస్తాడు. నలుగుర్లోనూ తిరగనేర్వనందువల్ల వాడి ప్రవర్తన చూసే వాళ్ళకు అసహ్యంగానే కనిపిస్తుంది.

వాడు ఇంటికి వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. ఇంతవరకూ గుసగుసలాడుతూన్న పిల్లలు వాడి వైపు నిరాదరణగా చూసి, అల్లరి చేద్దామనే వాంఛను కనబరిచారు. క్రమంగా అందరూ వాణ్ణి చుట్టేశారు.

సైమన్‌కు ఇదేమీ అర్థం కాలేదు. చుట్టూవున్న పిల్లల్ని చూసి ఆశ్చర్యపడ్డాడు. భయం కూడా వేసింది. వాళ్ళు తనను ఏం చేస్తారోనని చూస్తున్నాడు.

ఈ సువార్తను మొట్టమొదటగా మోసుకొచ్చిన కుర్రాడు తాను గొప్ప విజయాన్ని సంపాయించిన గర్వంతో ముందుకు వచ్చి, గంభీరంగా అడిగాడు: "నీ పేరేమిటి?"

కుర్రాడు నెమ్మదిగా జవాబిచ్చాడు: "సైమన్."

"ఏ సైమన్?" అన్నాడు మరో కుర్రాడు.

కుర్రాడు గాబరాపడి మళ్ళీ అన్నాడు: "సైమన్."

పెద్దకుర్రాడు గట్టిగా అరిచాడు: "నీ పేరు సైమన్ అనగానే సరిపోతుందా? సైమన్‌కు పక్కన ఏమైనా ఉండాలి. వట్టి సైమన్ అనేది పేరేకాదు."

సైమన్ కన్నీళ్ళతో మళ్ళీ అన్నాడు: "నా పేరు సైమన్. అంతే."

మిగతా కుర్రాళ్ళందరూ పెద్దగా నవ్వారు. పెద్దకుర్రాడు మాత్రం విజయగర్వంతో అరిచాడు: "చూశారా! వీడికి తండ్రిలేడు."

ఎవ్వరూ మాట్లాడలేదు. పెద్ద నిశ్శబ్దం ఆవరించింది. ఇంత విచిత్రం, తాము నమ్మలేని అసంభవమేదో నిజమని రుజూకావటం వల్ల పిల్లలందరూ ఆశ్చర్యంతో మూగవోయారు. తండ్రిలేని పిల్లాడు! బ్లాంఛొట్టే అంటే ఏదో ద్వేషంతో కూడుకున్న అభిమానాన్ని తమ తల్లులు ప్రదర్శిస్తూండేవాళ్ళు. ఈనాడు అందుకు కారణమేమిటో వాళ్ళు శ్రమపడి కనుక్కోగలిగారు.

ఇక సైమన్ కిందపడిపోకుండా ఉండేందుకు పక్కనే వున్న చెట్టును ఆధారంగా పట్టుకున్నాడు. భరించరానంత దెబ్బను తట్టుకునేందుకు వాడు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఏదోవిధంగా జవాబు చెపుదామని వాడనుకున్నాడు. కాని వాడి బుల్లి బుర్రకు సమాధానమేమీ దొరకలేదు. చివరకు నిర్లక్ష్యంగా వాళ్ళకు గొంతెత్తి జవాబిచ్చాడు: "నాకూ తండ్రి వున్నాడు."

"ఎక్కడున్నాడు నీ తండ్రి?" అన్నాడు పెద్ద కుర్రాడు.

సైమన్ పెదవి కదల్చలేదు. తన తండ్రి ఎక్కడ వున్నాడో వాడికి తెలియదు. సైమన్ నిశ్శబ్దత పిల్లలందరికీ ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఉద్రేకంతో వాళ్ళంతా పెద్దగా

అరిచారు. కోళ్ళగుంపులో ఒక కోడి దెబ్బతింటే మిగతావి ఆనందిస్తాయి. ఈ కర్షకుల బిడ్డల్లో కూడా ఆ జంతువుల తాలూకు లక్షణాలు కొన్ని లేకపోలేదు.

తన ఇంటి పక్కనవుండే ఇంకో కుర్రాణ్ణి సైమన్ హఠాత్తుగా గుర్తించాడు. వాడికి కూడా తండ్రి లేడు. అందుకనే వాడూ తనలాగే తల్లి కొంగు పట్టుకొని వేళ్ళాడుతూంటాడు. ఈ కుర్రాణ్ణి చూడగానే సైమన్‌కు కొత్త ఆలోచన తట్టింది.

“నీకు తండ్రి లేడుగా!” అన్నాడు ఆ కుర్రాణ్ణి ఉద్దేశించి.

“నాకూ వున్నాడు” అని ఆ కుర్రాడు జవాబు చెప్పాడు.

“ఎక్కడ వున్నాడు?”

“ఆయన చనిపోయాడు. శ్మశానంలో ఉన్నాడు!”

ఆ కుర్రాడి జవాబుకు మిగతా కుర్రాళ్ళందరూ తమ సమ్మతిని, ఆనందాన్ని వెలిబుచ్చారు. సైమన్‌కు అసలు తండ్రే లేడు. ఈ కుర్రాడికి తండ్రి వున్నాడు. కాని ఆయన చనిపోయి శ్మశానంలో వున్నాడు! అన్నిటినీ మించి ఈ కుర్రాడి జవాబుతో సైమన్‌కు పరిపూర్ణ అపజయం కలిగింది!

ఈ పిల్లలకు తమ తండ్రులు ఎలాటివారో తెలియదు అందులో దొంగలు, మూర్ఖులు, తాగుబోతులు, నిష్ప్రయోజకులు, తమ భార్యల్ని బానిసలకన్న హీనంగా చూసే నీచులూ ఉన్నా- అలాంటి తండ్రుల కొడుకులైన వీళ్ళు సైమన్‌ను చుట్టేసి, దగ్గరిదగ్గరికి రాసాగారు. సైమన్‌లాటి వాళ్ళకు బతికే అర్హత లేనట్లూ, ఎంత నీచుల సంతానమైనా తమకే ప్రభుత్వరక్షణ ఉన్నట్లూ వారు ప్రవర్తించసాగారు.

సైమన్‌కు పక్కనే వున్న కుర్రాడు నాలిక బైటికి పెట్టి వాణ్ణి వెక్కిరిస్తూ “తండ్రి లేడు! తండ్రి లేడు!” అని నాట్యం చేయసాగాడు.

సైమన్‌కు ఒళ్ళు తెలియనంత కోపం వచ్చింది. ఆ కుర్రాడి జుట్టు రెండు చేతులతోనూ పట్టుకొని వాడి కాళ్ళ మీద తన్నసాగాడు. ఆ రెండో కుర్రాడు సైమన్ చెక్కిలి మీద కొరికాడు. వాడు సైమన్‌కన్న వయసువాడు కావటం వల్ల సైమన్‌ను కిందపడేసి బాదాడు. సైమన్ బట్టలు పాడైనవి, చిరిగినవి కూడాను. దెబ్బలు బాగా తగిలినాయ్. మెల్లిగా లేచి నిలబడి వాడు బట్టలకైన దుమ్మును దులుపుకోసాగాడు.

చుట్టూ జేరిన కుర్రాళ్ళకు సైమన్ అపజయం, అవమానం చాలా ఆనందాన్ని కలిగించినవి. వాళ్ళు నవ్వుతున్నారు. ఒకడు అన్నాడు: “వెళ్ళి మీ నాయనతో చెప్పుకో!”

సైమన్ తనలోతాను చాలా కుంగిపోయాడు. వీళ్ళు తనకన్న ఎంతో బలవంతులు. వీళ్ళు తనను తన్నారు. అయినప్పటికీ తాను సరైన జవాబు ఇవ్వలేకపోయాడు. ఎందుకంటే తనకు తండ్రి లేడనే నిజం తనకు తెలియకపోతేగా!

హృదయంలో దాగలేని దుఃఖం కన్నీటి రూపాన బైటపడేందుకు ప్రయత్నిస్తూన్నప్పటికీ, అభిమానాన్ని చంపుకోలేని సైమన్ మరి నిలవదొక్కుకో లేకపోయాడు. పెద్దగా ఏడవలేకపోయాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ, ఉద్రేకంతో వూగిపోసాగాడు. సైమన్ ఎంత బాధపడుతున్నాడో అతని శత్రువులు అంత ఆనందిస్తున్నారు. తమ సంతోషాన్ని వెలిబుచ్చేందుకు వాళ్ళు ఒకళ్ళ చేతుల్ని వేరొకరు పట్టుకొని సైమన్ చుట్టూ నాట్యం చేస్తూ "తండ్రి లేడు! తండ్రి లేడు!" అని అరవసాగారు.

హఠాత్తుగా సైమన్ వెక్కి వెక్కి ఏడ్వటం ఆపాడు. తన కాళ్ళకింద రాళ్ళు వున్న సంగతి వాడు ఇప్పుడే గుర్తించాడు. రాళ్ళను ఏరి బలంకొద్దీ తన శత్రువుల మీదికి విసరసాగాడు. ఇద్దరు ముగ్గురికి మంచి దెబ్బలే తగిలినవి. బాధతో అరిచి వాళ్ళు పరుగెత్తారు. రాళ్ళు వర్షపాతంగా పడుతున్నవి. ఆ దెబ్బలకు తట్టుకోలేక మిగతా వాళ్ళు భయంతో పిరికిపందలల్లే కాళ్ళకు బుద్ధిచెప్పారు.

త్వరలోనే సైమన్ ఒంటరివా డయ్యాడు. తను తండ్రి లేని ఒంటరివాడు! అవమానం వాణ్ణి దహించి వేసింది. పిచ్చివాని వలె వాడు పొలాలకు అడ్డంపడి పరుగెత్తసాగాడు. ఈ అవమానతాపం నదిలో మునిగిపోతేనే కాని చల్లారదని వాడి బుల్లి బుర్ర నిశ్చయించింది!

సరిగ్గా ఒక వారం క్రితం ఒక ముష్టివాడు తినేందుకు తిండిలేక, నీళ్ళల్లో మునిగి చనిపోయాడనే సంగతి వాడికి తెలుసు. ఆ బిచ్చగాడి శవాన్ని బైటికి లాగేటప్పుడు తను అక్కడే వున్నాడు. ఆ నిర్భాగ్యుడి రూపం, పాలిపోయిన చెక్కిళ్ళూ, అడ్డదిడ్డంగా పెరిగిన గడ్డం, తెరిచివున్న కళ్ళల్లోని శాంతి, వికృతమైన శరీరాకృతి తన కళ్ళకు కట్టినట్లుగా వుంది.

ప్రేక్షకుల్లో ఒకడు "వీడు చచ్చాడు" అన్నాడు.

"వాడిప్పుడు హాయిగా వున్నాడు. మరి బాధలేమీ వాణ్ణి వేధించవు" అన్నాడు మరొకడు.

కనుక నదిలో పడటం వల్ల బాధలు లేకుండా హాయిగా వుండొచ్చని వాడి నమ్మకం. ఆ బిచ్చగాడికి, కూడు దొరక్క చచ్చాడు. తనకు తండ్రి లేడు కనుక చస్తాడు. అంతే తేడా!

నది ఒడ్డుకు వచ్చి నిలబడ్డాడు. స్వచ్ఛమైన నీరు వేగంగా ప్రవహిస్తూనే వుంది. నీటిమీద పడిన సూర్యరశ్మి తళతళ మెరుస్తోంది. ఉండి ఉండి చేపలు నీటిపైకి వచ్చి దొరికిన సన్నపురుగుల్ని పట్టుకుంటున్నవి. వాడు తన విచారాన్ని మరిచిపోయాడు. చేపల ఆట వాడికి చాలా తమాషాగా వుంది. కాని ఉండి ఉండి వాడికి విచారం కలుగుతూనే వుంది. పెద్ద గాలివాన కాసేపు ఆగి మళ్ళీ మొదలైనట్లుగా వాడి దుఃఖం వాణ్ణి వదలకుండా వేధిస్తూనే వుంది. 'నాకు తండ్రి లేడు కనుక నదిలో మునిగి

పోయేందుకు సిద్ధమౌతున్నాను' అనే వాడి నిశ్చయం కళ్ళ ముందు మెరుస్తూనే వుంది.

వాతావరణం చాలా హాయిగా వుంది. వెచ్చని సూర్యకిరణాలు పచ్చనిగడ్డిని వేడిచేస్తున్నవి. నదిలో ప్రవహించే నీరు సంగీతాన్ని పాడుతున్నట్లుంది. ఈ ప్రకృతి శోభను ఆనందిస్తూ సైమన్ కొన్ని నిమిషాల పాటు అట్లాగే ఉండిపోయాడు. ఆ మెత్తని వెచ్చని గడ్డిమీద హాయిగా నిద్రపోదామనే వాంఛకూడా వాడికి కలిగింది.

వాడి కాళ్ళ కిందనుంచి ఒక ఆకుపచ్చని కప్ప ఎగిరింది. వాడు దాన్ని పట్టుకోవాలని ప్రయత్నించాడు; కాని అది తప్పించుకుంది. సైమన్ దాన్ని వెంబడించి పట్టుకోవాలని ముమ్మారు ప్రయత్నించి విఫలుడయ్యాడు. చివరకు ఎలాగో దాని వెనుక కాలును పట్టుకోగలిగాడు.

ఆ కప్ప తప్పించుకునేందుకు గుంజుకోసాగింది. దాని అసహాయస్థితికి సైమన్ హాయిగా నవ్వాడు. అది తిరిగి ప్రయత్నం చేసి బలాన్నంతటినీ కూడదీసుకుని వెనుక కాళ్ళను రెండుగట్టి కడ్డీలవలె జాచింది. గుండ్రని పెద్దకళ్ళను పూర్తిగా తెరిచి, ముందుకాళ్ళతో గాలిలో తన్నుకోసాగింది. కప్పమీద జాలివేసి సైమన్ దాన్ని వొదిలేశాడు.

వాడికి వెంటనే తన ఇల్లూ, తల్లీ జ్ఞాపకం వచ్చారు. గొప్ప దుఃఖంతో వాడి మనస్సు నిండిపోయింది. వాడి పెదవులు వణికినాయి. వాడు మోకరించి, నిద్రపోయే ముందు ప్రార్థన చేసినట్లుగా ధ్యానించసాగాడు. వాడి దుఃఖం మితిమీరి పోయింది. వెక్కి వెక్కి ఏడ్వనారంభించటం వల్ల ప్రార్థనను ముగించలేకపోయాడు. వాడికి వేరొక ఆలోచన లేదు. దేన్నీ లక్ష్యపెట్టే స్థితిలో వాడు లేడు– ఒక్క కన్నీటిని ఏడ్పును తప్ప!

హఠాత్తుగా ఒక బరువైన చెయ్యి వాడి భుజం మీద పడింది. ఒక బండగొంతు చెవిలో ప్రతిధ్వనించింది.

"నీకింత దుఃఖాన్ని కలిగించిన విషయమేమిటి నాయనా?"

సైమన్ వెనక్కు తిరిగి చూశాడు. బాగా కష్టించిన శరీరాకృతి వాడి వెనుక నిలబడి వుంది. ఆ పొడుగాటి వ్యక్తి జుట్టంతా ఉంగరాలు తిరిగి వుంది. అతని నల్లని గడ్డం నిగనిగలాడుతోంది. అతను చాలా దయగా తన వైపు చూస్తున్నాడు.

సైమన్ కన్నీళ్ళ మధ్యనే జవాబు చెప్పా లనుకున్నాడు. కాని దుఃఖంతో నిండిపోయిన వాడి గొంతు మాటల్ని సరిగా ఉచ్చరించలేకపోయింది. అతి ప్రయత్నం మీద వాడిలా అన్నాడు: "వాళ్ళు... బడిపిల్లలందరూ .... కలిసి నన్ను కొట్టారు. ఎందుకంటే.... నాకు తండ్రి లేడని!"

"ఏమిటీ" అన్నాడా వ్యక్తి ఆశ్చర్యంతో "ప్రతివాళ్ళకూ తండ్రి ఉంటాడు"

సైమన్ దుఃఖం పొంగివచ్చే గొంతుతోనే జవాబిచ్చాడు: "కాని... నాకు... తండ్రి లేడు!"

తరువాత ఆ కష్టజీవి ముఖం ఎర్రబడింది. అతను కొత్తగా ఆ వూరికి వచ్చాడు. యీ కుర్రాడు బ్లాంఛొట్టీ కొడుకనే సంగతి అతనికి ఇప్పుడే గుర్తుకొచ్చింది. ఆమె చరిత్ర కూడా అతనికి చూచాయగా తెలుసు.

"సరే... ఏడవకు నాతోరా– మీ ఇంటికి వెళ్దాం. మీ అమ్మ నీకొక తండ్రిని తప్పక ఇస్తుంది" అన్నాడా కార్మికుడు.

కార్మికుడు కుర్రవాడిని చెయ్యిపట్టుకొని నడిపించసాగాడు. అతని పెదవుల మీద కొత్తగా చిరునవ్వు చిందులాడింది. ఎందుకంటే బ్లాంఛొట్టిని చూడటమంటే అతనికి ఆనందమే! జనాభిప్రాయం ప్రకారం ఆమె చాలా అందమైనది. కార్మికుని హృదయాంతరాళంలో ఒక అభిప్రాయం మెదిలింది. 'ఒకసారి కాలుజారిన స్త్రీ మరోసారి ఎందుకు జారదు?'

శుభ్రంగా వున్న ఒక చిన్న ఇంటి ముందుకు వారు వచ్చారు.

"ఇదే మా ఇల్లు" అన్నాడు కుర్రాడు. "అమ్మా" అని పెద్దగా పిలిచాడు.

ఆమె తలుపు తెరిచింది. ఆమె అందంగా, పొడుగ్గా వున్నప్పటికీ పాలిపోయి వుంది. ఆమె ముఖంలో దీనత్వం ఉట్టి పడుతూ వుంది. యీ ఇంటి గడపమీదనే ఆమె ఒక పురుషుని వల్ల మోసగించబడి ఉండటం వల్ల, వేరొక పురుషుని బారి నుండి తప్పించుకునే ప్రయత్నం ఆమె కన్నుల్లో స్పష్టంగా కనిపిస్తూ వుంది. ఈ దీనురాలిని బాధించేందుకు మనస్కరించక కుర్రవాడి చేతిని వెంటనే వదలిపెట్టాడు. గౌరవసూచకంగా టోపీని చేత్తో పట్టుకుని "ఈ కుర్రాడు నదివొడ్డున కూర్చుని ఏడుస్తుంటే, నేను తీసుకొచ్చాను" అన్నాడు.

కాని సైమన్ ఈ మాటల్నేం వినిపించుకోలేదు. వాడు తన తల్లి మెడను గట్టిగా పట్టుకొని ఏడుస్తూ ఇలా అన్నాడు: "అది కాదమ్మా! నేను నదిలో మునిగి పోదామనుకున్నాను. నన్ను అందరూ కొట్టారు. నాకు తండ్రి లేదని!"

ఆమె చెక్కిళ్ళు ఎర్రని నిప్పు కణాలవలె మారినవి. ఆమె చాలా గాయపడినప్పటికీ కుర్రాణ్ణి ఎంతో ఆదరంతో కావిలించుకుంది. కన్నీళ్ళను ఆపుకోవాలనే ఆమె ప్రయత్నం భగ్నమైంది. కార్మికుడికి ఈ దృశ్యం చాలా బాధాకరంగా తోచింది. ఏ విధంగా ఇక్కణ్నుంచి తప్పుకోవాలో తోచక అతను అక్కడే నిలబడిపోయాడు.

సైమన్ హఠాత్తుగా అతని దగ్గరికి పరుగెత్తి "నీవు నాకు తండ్రిగా ఉంటావా?" అని అడిగాడు.

ఎవ్వరూ మాట్లాడగలిగే స్థితిలో లేరు. బ్లాంఛొట్టే సిగ్గుతో కాలిపోతోంది. కింద పడిపోకుండా గోడ ఆధారంగా పట్టుకొని నిలబడ గలిగింది. ఈ నిశ్శబ్దతకు అర్థం తెలియని సైమన్ ఇలా అన్నాడు: "నీవందుకు ఇష్టపడకపోతే నేను వెళ్ళి నదిలో మునిగిపోతాను."

ఇదంతా ఎగతాళిగానే తీసుకొని, కేవలం నవ్వులాటకు, ఆ కుర్రాణ్ణి ఊరడించేందుకు గాని "ఓ! తప్పకుండా నీ కోర్కె తీరుస్తాను" అన్నాడు కార్మికుడు.

"అయితే నీ పేరేమిటి?" అన్నాడు కుర్రాడు. "ఈసారి వాళ్ళు అడిగినప్పుడు నేను నా తండ్రి పేరు చెప్పొద్దూ?"

"ఫిలిప్" అన్నాడు కార్మికుడు.

ఆ పేరును బాగా జ్ఞాపకం చేసుకుంటూ సైమన్ ఒక్క నిమిషం నిశ్శబ్దంగా వున్నాడు. ఆ తరువాత అనురాగంతో తన రెండుచేతుల్నీ కార్మికుని వైపు జాపుతూ "అయితే నీవే నా తండ్రివి" అన్నాడు సైమన్.

కార్మికుడు కుర్రాణ్ణి ప్రేమతో పైకి ఎత్తి, వాడి రెండు చెక్కిళ్ళను ముద్దాడి, మెల్లిగా నేలమీద దింపి చకచకా తన దారిన వెళ్ళిపోయాడు.

## 2

మర్నాడు సైమన్ స్కూలుకు వెళ్ళాడు. కుర్రాళ్ళందరూ వాణ్ణి చిన్నచూపు చూసి, ఎగతాళిగా నవ్వారు. స్కూలు వదిలాక కుర్రాళ్ళు కిందటి రోజల్లేనే సైమన్‌ను ఏడిపించేందుకు గుమిగూడారు.

వాళ్ళు అల్లరి మొదలెట్టక ముందు, నిన్న తాను విసిరిన రాళ్ళకన్న పదునుగా ఉంటాయనే ఉద్దేశంతో సైమన్ ఆ మాటల్ని విసిరాడు.

"నా తండ్రి పేరు ఫిలిప్."

ఆనందంతో అందరూ నవ్వారు.

"ఫిలిప్? ఎవరా ఫిలిప్? ఎక్కడ వుంటాడు? ఈ పేరు ఎక్కడ ఏరుకొచ్చావ్?" అన్నాడు పెద్ద కుర్రాడు.

సైమన్ జవాబు చెప్పలేదు. వాడి గాఢనమ్మకం వాణ్ణి పడ్డచోటునే పాతేసినంత బలమైనదిగా తోచింది. నిన్నటి లాగా భయపడి పరుగెత్తటం కన్నా వీళ్ళు పెట్టే బాధల్ని భరించేందుకే వాడీనాడు నిశ్చయించుకున్నాడు. కాని అదృష్టవశాత్తు సమయానికి మాస్టారుగారు వచ్చి, వాణ్ణి సురక్షితంగా ఇల్లు జేర్చారు.

మూడునెలలుగా ఫిలిప్ అడపాదడపా బ్లాంభొట్టే ఇంటిదగ్గరనుంచి వస్తూ పోతూనే వున్నాడు. ఆమె ఏ కిటికీ దగ్గర కూర్చుని కుట్టుపని చేసుకుంటూండగా ఆమెతో ఆ మాటా ఈ మాటా మాట్లాడేందుకు సాహసించేవాడు. ఆమె మర్యాదగా మాట్లాడేది. ఎన్నడూ పరిహాసమాడేది కాదు. అతన్ని ఇంటిలోకి రానిచ్చేదే కాదు. ఆమె లొసుగులున్న మనిషనుకున్నాడు. కాని ఆమె ప్రవర్తన చూశాక కార్మికునికి ఆమె పట్ల గౌరవభావం

పెంపొందసాగింది. ఆమె తనతో మాట్లాడుతూన్నప్పుడు ఆమె ముఖం ఎర్రబారటాన్ని అతను అనేకసార్లు గమనించాడు.

కాని ఒకసారి చెడిన గౌరవాన్ని తిరిగి సంపాయించటం చాలా కష్టం' బ్లాంభొట్టే ఎంత గౌరవంగా, మర్యాదగా బతికేందుకు ప్రయత్నిస్తూన్నప్పటికీ ఆ 'పగులు' సరిగ్గా అతకటం లేదు. ఇరుగుపొరుగులు అడపాదడపా ఆమెను గూర్చి గుసగుసలాడుతూనే వున్నారు.

సైమన్ మాత్రం తాను సంపాయించిన ఈ తండ్రిని గూర్చి గర్వపడుతూనే వున్నాడు. దాదాపు ప్రతి సాయంత్రమూ అతనితో షికారు వెళ్తూనే వున్నాడు. బడిలో మిగతా పిల్లలంటే వాడు లెక్కచేయటం లేదు. తన గొప్పను వాళ్ళు గుర్తించకపోవటం వాళ్ళ లోపమని వాడి నమ్మకం. వాళ్ళు మాట్లాడించినా వాడు జవాబు చెప్పకుండానే, చాలా హుందాగా, గర్వంగా ప్రవర్తించసాగాడు.

ఒకనాడు పెద్దకుర్రాడు అన్నాడు: "సైమన్! నీవు అబద్ధమాడావు. ఫిలిప్ అనే పేరుగల తండ్రి నీకు లేదు."

సైమన్ కాస్త గాభరాపడి "నీవెందుకు అలా అడుగుతున్నావు?" అన్నాడు.

"ఎందుకంటే నీకు తండ్రంటూ వుంటే అతను నీ తల్లికి భర్త కూడా అయి వుండాలిగా!" అన్నాడు పెద్దకుర్రాడు.

ఈ వాదనలోని నిజానికి సైమన్‌కు మతిపోయినట్లయింది. అయినప్పటికీ నిలవదొక్కుకొని ఏదోవిధంగా సమాధానం చెప్పాడు. "ఏమైనా అతను నా నాయనే!"

"కావచ్చు" అన్నాడు పెద్దకుర్రాడు అసహ్యంతో చీదరించుకుంటూ. "కాని అంతమాత్రం చేత 'మా నాయన' అని గప్పాలు కొట్టుకోనక్కర్లేదు!"

సైమన్ తలవొంచుకుని మెల్లిగా నడవసాగాడు. వాడి బుర్రలోని ఆలోచనల భారం వాడిని కుంగదీస్తోంది. ఫిలిప్ పనిచేసే కమ్మరికొలిమి వైపు వాడు వెళ్ళాడు.

కొలిమి పెద్దచెట్ల మధ్య వుండటం వల్ల అంతా చీకటిగా వుంటుంది. కొలిమిలోని నిప్పు మాత్రం పెద్ద వెలుగును విరజిమ్ముతూ వుంటుంది. నలుగురు బలశాలురు ఎర్రగా కాల్చబడిన ఇనుపముక్కమీద బలంకొద్దీ దెబ్బలు వేస్తున్నారు. రాక్షసులల్లే నిలబడి వేరొక ఆలోచన లేకుండా ఎర్రని ఇనుమువైపు చూస్తూ తమ ఆలోచనల్ని చేతపట్టుకొన్న పెద్ద సుత్తులతో పాటే పైకీ కిందికీ జరుపుకుంటూ కష్టించి పని చేస్తూంటారు. అక్కడ పనిచేసే ఐదుగురిలోనూ ఫిలిప్ ఒకడు.

సైమన్ ఎవరి దృష్టినీ ఆకర్షించకుండానే లోనికి ప్రవేశించి తన స్నేహితుణ్ణి మెల్లిగా గిల్లాడు. పనిచేస్తున్న ఫిలిప్ సైమన్‌వైపు తిరిగాడు. అంతవరకూ ఏకధాటిగా జరుగుతూన్న పని చప్పున ఆగిపోయింది. మిగతా పనివాళ్ళందరి దృష్టీ సైమన్‌వైపే

కేంద్రీకరించబడింది. నిశ్శబ్ద వాతావరణాన్ని సైమన్ మృదువైన కంఠధ్వని భంగపరిచింది.

"ఫిలిప్! బడిలో వున్న పెద్దకుర్రాడు అన్నమాటలు నాకు అర్థం కాలేదు. నీవు నాకు పూర్తిగా తండ్రివి కావని వాడు అన్నాడు."

"ఎందుకు కాను?" అన్నాడు ఫిలిప్.

సైమన్ అమాయకంగానే అన్నాడు. "ఎందుకంటే మా అమ్మకు భర్తవు కావటగా!"

ఈ మాటలకు ఎవ్వరూ నవ్వలేదు. ఫిలిప్ తన ఫాలభాగానికి బలిష్టమైన పెద్దచేతిని అడ్డం పెట్టుకున్నాడు. అతను ఆలోచనలో పడ్డాడు. మిగతా నలుగురు పనివాళ్ళు ఫిలిప్‌ని ఆతృతతో గమనిస్తూనే వున్నారు. మొత్తం దృశ్యాన్ని సైమన్ ఆతృతతో గమనిస్తున్నాడు. పనివాళ్ళల్లో మిగతా అందరి అభిప్రాయాన్నీ బైటపెడుతున్న ధోరణితో ఇలా అన్నాడు:

"ఏమైనా బ్లాంభొట్టే చాలామంచిది. గౌరవమర్యాదలు గలది. కాని ఆమె దురదృష్టవంతురాలు! గౌరవనీయునికి తగిన భార్య ఐ తీరుతుంది."

"ఆమె పతితురాలవటం ఆమె తప్పేనా? ఆ నేరమంతటికీ ఆమేనా బాధ్యురాలు? ఆమెను వివాహమాడతానని వాగ్దానం చేసిన పెద్దమనిషి మొహం తప్పించాడు. పైకి మాత్రం అందంగా కనిపిస్తూ ఆమె కన్నా పాపం చేసేవాళ్ళూ చాలామంది మనచుట్టూ వున్నారు" అన్నాడు ఫిలిప్.

"అది నిజమే" అన్నారు ముగ్గురూ ఏకకంఠంతో.

"పాపం! ఈ బిడ్డకు చదువు చెప్పిద్దామని ఆమె కష్టపడుతోంది! ఒంటరిగా బతుకుతూ ఇరుగుపొరుగు ప్రమేయం లేకుండా ఇంటిలోనే వుండి ఆమె ఎంత బాధపడుతోంది! చర్చ్‌కి తప్ప వేరెక్కడికీ వెళ్ళని ఆమె క్షోభ ఒక్క భగవంతునికే తెలుసు!"

"అదీ నిజమే!" అన్నవి మూడు కంఠాలు.

ఇక ఆమెను గూర్చి మాట్లాడటం అనవసరమన్నట్లు కొలిమి పని సాగింది. గాలిని పోసుకుంటూన్న కొలిమి నిప్పురవ్వల్ని కక్కుతూ ఎర్రని వెలుగును విరజిమ్మసాగింది.

ఫిలిప్ వంగి సైమన్ చెవిలో రహస్యంగా "నీవు ఇంటికి వెళ్ళు నేను వచ్చి అమ్మతో మాట్లాడతానని చెప్పు" అన్నాడు.

సైమన్ ఏదో ఆలోచించుకుంటూ వెళ్ళిపోయాడు. నాలుగు సుత్తులూ ఒకదాని తర్వాత వేరొకటిగా తాళం వేస్తున్నట్లు పనిచేయసాగినవి. ఈ విధంగా వారు చీకటి పడేదాకా కష్టించి పనిచేస్తారు. తమ బలానికి ఆరోగ్యానికి, సంతృప్తికి గర్వపడ దగ్గ జీవులు. మిగతా కమ్మరుల దెబ్బలకూ, ఫిలిప్ దెబ్బకూ స్పష్టమైన భేదం వుంది. ప్రతి

నాలుగో దెబ్బలోనూ ఎక్కువ శబ్దం నిటారుగా నిలబడి కొలిమిలోని నిప్పురవ్వలవంక చూస్తూ, ఎర్రగా ప్రకాశించే ముఖంనుంచి ప్రసరించబడే ఎర్రని దృష్టిని అనుసరిస్తూనే ఎర్రగా కాలిన ఇనుమును సాగగొడుతూంటాడు. ఈ దినచర్య అతనికి తప్పదు...

ఆకాశమంతా నక్షత్రాలతో ప్రకాశిస్తూ వుంది. ఇదే సమయంలో ఫిలిప్ బ్లాంఛొట్టే ఇంటి తలుపు తట్టాడు. బాగా చెమట పట్టిన శరీరానికి వేడి నీళ్ళు పోశాడు. గడ్డం అందంగా వుండేట్లు కత్తిరించాడు. ఆదివారంనాడు ధరించే మంచి దుస్తుల్ని వేసుకున్నాడు. మొత్తం మీద అందంగా కనిపించేంత ప్రయత్నమూ చేశాడు.

ఆమె తలుపు తెరచింది. కాని దుఃఖంతో నిండిన కంఠస్వరంతో బాధగా అంది. "రాత్రిపూట ఈ విధంగా రావటం చాలా తప్పు కదా?"

అతను జవాబు చెప్పాలనుకున్నాడు. కాని గాబరాపడి అలాగే నిలబడిపోయాడు.

ఆమె మళ్ళీ అంది. "నాతో మరి మాట్లాడకూడదనే సంగతి మీకు తెలియంది కాదు."

ఇప్పటికి అతను తన శక్తుల్ని కూడదీసుకున్నాడు. హఠాత్తుగా నిశ్చయ కంఠంతో అన్నాడు.

"మాట్లాడితే ఏం- నీవు నా భార్యవైతే?"

అతనికి జవాబైతే రాలేదు. కాని ఒకానొక శరీరం గదిలోని గుడ్డి వెలుగులో కిందపడిన శబ్దం వినిపించింది. అతను వెంటనే గదిలోకి పరుగెత్తాడు. అప్పుడే నిద్రపడుతూన్న సైమన్‌కు తనను ముద్దుపెట్టుకోవడం, తన చెవిలో మృదువైన మాటలేవో తల్లి చెప్పటం తెలుస్తూనే వుంది. వెంటనే బలిష్ఠమైన తన స్నేహితుని చేతులు వాణ్ణి పైకి ఎత్తినవి, వాడికి బాగా మెలకువ వచ్చింది.

"రేపు మీ బడిలోని పిల్లలందరికీ చెప్పు. మీ తండ్రి కమ్మరి పనిచేసే ఫిలిప్ రామీ అని. నీకు అపకారం చేసేందుకు సాహసించే వాళ్ళ చెవుల్ని పిండుతానన్నానని కూడా చెప్పు" అన్నాడు ఫిలిప్.

మర్నాడు క్లాసులో అందరు పిల్లలూ పాఠం వినేందుకు సిద్ధంగా వున్న సమయంలో, సైమన్ లేచి నిలబడి, వెలవెలబోతూ వణికే పెదవులతో అన్నాడు. "నా తండ్రి పేరు ఫిలిప్‌రామి. ఆయన కమ్మరిపని చేస్తాడు. నాకు అపకారం చేసే ప్రతివాణ్ణి చెవులు పిండుతానని మీ అందరితోనూ చెప్పమన్నాడు!"

ఈసారి నవ్వేందుకు కాదుకదా, చిరునవ్వుకు కూడా ఎవ్వరూ సాహసించలేదు. ఫిలిప్ రామీ అంటే అందరికీ తెలుసు! అలాంటి భీమబలుడికి కొడుకుగా ఉండటం గర్వించదగ్గ విషయమనే సంగతి కూడా అందరికి తెలుసు!